ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు జిల్లా వార్తలు

శనివారం 22 మార్చి 2025

తిరుమలలో చంద్రబాబు కుటుంబం



నుదుట తిరునామం.. తళతళ మెరిసే సరిగ పంచె, లాల్చీ.. మెడలో పట్టు కండువా.. సంప్రదాయ వస్త్రధారణతో తాతా మనవళ్లు ఇద్దరూ శుక్రవారం తిరుమలలో సందడి చేశారు. చిరునవ్వులతో భక్తులకు అన్నం వడ్డించారు. నారా దేవాన్ష్ 11వ పుట్టినరోజున ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం, అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భోజనాలు వడ్డించారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే రూ.44 లక్షల విరాళాన్ని టీటీడీకి అందజేశారు. ఏటా ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం పాటిస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అన్నం వడ్డించి.. ఆప్యాయంగా పలకరించి..

దేవాన్ష్ పుట్టినరోజు సందడి



శ్రీవారి ఆలయంలో సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

సీఎం చంద్రబాబుతో పాటూ ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, దేవాన్ష్ ఉదయం 8.30గంటలకు శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. సీఎం హోదాలో మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే అవకాశమున్నప్పటికీ చంద్రబాబు ఎప్పటిలానే వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారానే దర్శనానికి వెళ్లారు. ఉదయం 8.28 గంటలకు మహద్వారం వద్దకు చేరుకున్న సీఎంకు టీటీడీ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. దర్శనం తర్వాత రంగనాయక మండపంలో వేదాశీర్వచనం అందుకుని 9.19 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు. దాదాపు 40 నిమిషాల పాటు సీఎం కుటుంబం ఆలయంలో గడిపింది.అంతకు అరగంట ముందే ఏర్పాట్ల పర్యవేక్షణకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆలయంలోకి వెళ్లారు. సీఎం రాకకు ముందే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కూడా ఆలయంలోకి వెళ్లారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూడా వైకుంఠం కాంప్లెక్స్ ద్వారా ముందే ఆలయంలోకి వెళ్లారు. సీఎం కుటుంబం ఆలయంలోకి వెళ్లిన తర్వాత తిరుపతి, చంద్రగిరి, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, మురళీ మోహన్ లోపలికి వెళ్లారు. ఆ తర్వాత మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాసులు, శ్రీధరవర్మ, అన్నా రామచంద్రయ్య, అనితా యాదవ్, హేమాంబరధర నాయుడు,బుల్లెట్ రమణ, కృష్ణయాదవ్ తదితరులు ఆలయంలోకి ప్రవేశించారు.

అన్నప్రసాదాలు వడ్డిస్తూ..

శ్రీవారి దర్శనం అనంతరం ఉదయం 9.25గంటల ప్రాంతంలో చంద్రబాబు కుటుంబం వెంగమాంబ అన్నప్రసాదానికి చేరుకుంది. తొలుత వేంకటేశ్వర స్వామి పటం వద్ద పూజలు నిర్వహించారు.ముఖ్యమంత్రిననే హోదాను పక్కనబెట్టి మనవడికి అన్నదానం ప్రాధాన్యాన్ని వివరిస్తూ, చంద్రబాబు అన్నదాన సత్రంలో భక్తుల విస్తర్లలో అన్నప్రసాదాలను వడ్డించారు. దేవాన్ష్, చంద్రబాబు, లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణిలు భక్తులకు బెల్లం పొంగలి, మసాలా వడలను అరిటాకుల్లో వడ్డించారు. ఈ సమయంలో భక్తులతో కలుపుగోలుగా మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు, అన్నప్రసాదాలు ఎలా ఉన్నాయి, ఏవైనా సమస్యలున్నాయా అని అడుగుతూ సీఎం అన్నప్రసాదాలను వడ్డించారు. అన్నప్రసాదాలు చాలా రుచిగా ఉన్నాయంటూ భక్తులు సీఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సీఎం కూడా కుటుంబ సభ్యులతో కలిసి అరిటాకుల్లో వడ్డించిన అన్నప్రసాదాలను స్వీకరించారు.

సీఎం వెంట టీటీడీ బోర్డు

తిరుమల పర్యటనలో సీఎం కుటుంబం వెంట టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు సహా పలువురు బోర్డు సభ్యులున్నారు. బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, శాంతారాం, భానుప్రకాష్‌రెడ్డి, నరేష్, పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి ఈ కార్యక్రమంలో ఉన్నారు. ఆరణి మదన్, పులివర్తి వినీల్ అన్నదాన సత్రంలో సీఎం కుటుంబంతో పాటు ఉన్నారు.

గట్టి భద్రత- మాడవీధులు నిర్మానుష్యం

మరోవైపు సీఎం పర్యటనలో తిరుమలలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయ ప్రాంతం, మాడవీధులు రెండు గంటల పాటు నిర్మానుష్యంగా మారాయి.ఎక్కడికక్కడ గేట్లు వేయడంతో ఒకప్రాంతం నుంచి మరొకప్రాంతానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఎం ఆలయంలోకి వెళ్లిన తర్వాత కూడా అరటిమానులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌లో బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. మీడియాను కూడా గొల్లమండపానికే పరిమితం చేశారు. కాగా అన్నదాన వితరణ అనంతరం అతిథిగృహానికి చేరుకున్న సీఎంను కలిసేందుకు తిరుపతి, తిరుమల టీడీపీ కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాలతో వీరిని పోలీసులు అడ్డుకోవడంతో బయటే ఉండిపోవాల్సి వచ్చింది. అయితే తిరుగు ప్రయాణంలో సీఎం చంద్రబాబు కార్యకర్తలను చూసి కాన్వాయ్ నుంచి కిందకు దిగి వినతిపత్రాలు



అందుకున్నారు. పలువురిని ఆప్యాయంగా పలకరించారు. అందరికీ అభివాదం చేస్తూ తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

మూడునెలలు గుడి మూసేయాలన్నారు

- తిరుమలలో నీటి ఎద్దడి రోజులను గుర్తుచేసిన సీఎం

'గతంలో తిరుమలలో నీళ్ల సమస్య తీవ్రంగా వచ్చింది. మూడు నెలల పాటు శ్రీవారి ఆలయాన్ని మూసివేయడం తప్ప మరో దారి లేదని అధికారులు నాతో చెప్పారు. నాకు చాలా కోపం వచ్చింది. 'ఆలయాన్ని మూసివేయడం ఏంటయ్యా మీకేమైనా పిచ్చిపట్టిందా?' అని కోప్పడ్డాను. రోజుకు 600 నుంచి 800 ట్యాంకర్లను భక్తుల రాకపోకల మధ్య తిరుమలకు తీసుకొచ్చే పనులు చేయలేం అని అధికారులు నాతో అన్నారు. నేను అంగీకరించలేదు. కల్యాణిడ్యాం నుంచి తిరుమలకు నీళ్లు తీసుకువచ్చేలా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలనీ, అదీ 90 నుంచి 95 రోజుల్లో జరగాలని ఆదేశించా. లేకుంటే అరెస్ట్ చేస్తానని కూడా చెప్పా. దేవుడి కోసం కాబట్టి అందరినీ పిలిచి.. 'ఉన్న డబ్బులు ఇవే. పూర్తి చేయండి' అని కోరా. ఎల్అండ్‌టీ ముందుకొచ్చింది. అనుకున్న సమయానికి కళ్యాణి డ్యాం నుంచి తిరుమలకు పైప్ లైన్‌లు వేసింది. అంతే కళ్యాణి నీళ్లు తిరుమల కొండ మీదకి ఎక్కాయి.' అని ఒకనాటి రోజులను సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.తిరుపతి, తిరుమలలో నీటి సమస్యను పరిష్కరించేందుకు కండలేరు నీటి ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచుతారా అని మీడియా ప్రతినిధుల ప్రశ్నకు బదులిస్తూ.. 'తిరుమలకు నీళ్లు తీసుకురావడం పెద్ద సమస్యేమీ కాదు. సోమశిల, కండలేరు, బాలాజీ రిజర్వాయర్ ఉంది. కల్యాణి డ్యాం నుంచి కూడా తిరుమలకు నీళ్లు తీసుకుంటున్నాం. మల్లిమడుగు కూడా వస్తే తిరుపతికి నీటి సమస్య ఉండదు' అన్నారు. అసలు చరిత్ర ఏంటో మీరు తెలుసుకోవాలి. యువతరానికి కూడా మనం తెలియజేయాలి. తిరుపతిలో నీళ్లు లేక నిత్యం సమస్యలు ఏర్పడుతున్న క్రమంలో తెలుగు గంగను నేనే తీసుకొచ్చా అని వివరించారు.

ఎమ్మెల్యే కారును ఢీకొన్న వ్యాన్

సీఎం కాన్వాయ్‌లోని ఓ వ్యాన్ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కారును ఢీకొంది. సీఎం చంద్రబాబు తిరుగు ప్రయాణంలో పద్మావతి అతిథిగృహం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కాన్వాయ్‌తో సీఎం వాహనం ముందు వెళ్లిపోగా వెనుక వస్తున్న ఈవో కారు ఆగింది. వెనుకే వస్తున్న ఎమ్మెల్యే కారు వేగాన్ని అదుపుచేస్తూ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే కారు కూడా ఈవో కారును ఢీకొంది. ఇదే సమయంలో స్వల్పంగా పొగలు కూడా రావడంతో భద్రతాసిబ్బంది ఉలిక్కిపడ్డారు. వాహనం వద్దకు పరుగులపై చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కారు వెనుకభాగం స్వల్పంగా దెబ్బతింది. ఆ వెంటనే కార్లు అక్కడి నుంచి వెళ్లిపోయాయి.

నేటినుంచి టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

చిత్తూరు సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ కార్డులను శనివారం నుంచి ఈనెల 26వ తేదీవరకు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కార్యవర్గ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ ఆదేశాలతో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల అధ్యక్షతన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి.. కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. పోలింగ్ బూత్, గ్రామస్థాయి వరకు పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ కార్డు అందించాలని సూచించారు.

26న కుప్పానికి నారా భువనేశ్వరి

కుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 26 నుంచి 29వ తేదీదాకా నాలుగు రోజులపాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పార్టీ వర్గాలనుంచి అందిన సమాచారం మేరకు.. 26వ తేదీన కుప్పం చేరుకునే భువనేశ్వరి అదే రోజున తెలుగుదేశం పార్టీ నాయకులతో సమావేశమవుతారు. గుడుపల్లెలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొంటారు.సాయంత్రం కుప్పంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ చేరుకుని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. 27వ తేదీన ప్రజలనుంచి వినతులు స్వీకరించిన నంతరం కుప్పంలో ఇండియన్ బ్యాంకు బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. కుప్పం మున్సిపాలిటీ ఎన్టీఆర్ కాలనీలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు.కృష్ణదాసనపల్లె, జరుగు పంచాయతీల్లో సైతం మహిళలతో సమావేశమవుతారు. సాయంత్రం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో టీడీపీ ముఖ్య నేతలతో సమావేశం జరుపుతారు. 28వ తేదీన శాంతిపురం మండలం నడింపల్లెలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. అదే మండలం నక్కనపల్లెలో మల్బరీ తోటలను, సెరికల్చర్ షెడ్లను పరిశీలించి పట్టు రైతులతో సమావేశమై వారి సాదకబాధకాలు తెలుసుకుంటారు. అక్కడనుంచి రామకుప్పం మండలం రాజుపేటకు చేరుకుని మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. అనంతరం శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సొంత ఇంటి పనులను పరిశీలిస్తారు. 29వ తేదీన కుప్పం పట్టణంలోని షాహీ గార్మెంట్స్‌లో మహిళా కార్మికులతో ముఖాముఖిలో పాల్గొంటారు. అక్కడి నుంచి టీడీపీ కళ్యాణమండపం చేరుకుని లబ్ధిదారులకు తోపుడు బండ్లు, కుట్టు మెషిన్లు పంపిణీ చేస్తారు.మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరు మీదుగా హైదరాబాదుకు తిరుగు పయనమవుతారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:29 (శనివారం సాయంత్రం) సహర్: 4:55 (ఆదివారం ఉదయం)

చాపకింద నీరులా బెట్టింగ్ భూతం

- తక్షణ సంపాదన కోసం యువత వక్రమార్గం

- గంగాధర నెల్లూరుకు చెందిన దినేష్ అనే యువకుడు ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు బానిసై భారీగా అప్పులు చేశాడు. రూ.50 లక్షల అప్పులు తీర్చే మార్గం కనబడక దిక్కుతోచని పరిస్థితుల్లో తండ్రి నాగరాజులురెడ్డి, తల్లి జయంతి, అక్క సునీతతో కలసి గతేడాది అక్టోబరులో ఆత్మహత్య చేసుకున్నాడు.
- పెనుమూరు మండలానికి చెందిన ఓ యువకుడు బెట్టింగుల కోసం చేసిన అప్పులు తీర్చలేకపోవడంతో డబ్బిచ్చిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.తమ బిడ్డ ఏమైపోతాడోనని ఉన్న ఎకరం పొలం అమ్మి కుమారుడు చేసిన అప్పు అతడి తల్లిదండ్రులు చెల్లించారు.

ఐపీఎల్ 18వ సీజన్ పది జట్లతో శనివారం కోల్‌కత్తాలో ప్రారంభం కానుంది. సుమారు రెండు నెలలకుపైగా పోటీలు జరుగుతాయి. ఒకప్పుడు గెలుపోటముల మధ్య వేసే బెట్టింగులు ప్రస్తుతం టాస్ మొదలు బంతి బంతికీ, ఓవర్‌కు, సిక్సర్‌కు, ఫోర్‌కు విస్తరించాయి. స్మార్ట్ ఫోన్లు అందుబాటులో ఉండటంతో బెట్టింగ్ సులభతరమైంది.



పెనుమూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి):తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన కోసం యువత ఆన్‌లైన్ బెట్టింగ్ లాంటి వక్ర మార్గాలను ఎంచుకుంటోంది. తల్లితండ్రులకు తెలియకుండా చాలా మంది వడ్డీ వ్యాపారుల వద్ద రూ.5 నుంచి రూ.20 వరకు వడ్డీకి తీసుకుని మ్యాచ్ ముగియగానే తిరిగి చెల్లిస్తున్నారు. ఓడినవారు తమ సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు, ల్యాప్‌టాప్‌లు, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి ఇస్తున్నారు. అలా ఇవ్వలేని వారు ఆత్మహత్యలు చేసుకోవడం,లేదంటే ఇతరత్రా నేరాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.కొంతమంది తల్లిదండ్రులు వ్యవసాయ భూములు అమ్మి పిల్లలు చేసిన అప్పులు తీరుస్తున్నారు. కూలీల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఈ బెట్టింగ్ ఊబిలో చిక్కుకుని బయట పడలేకపోతున్నారు.మొదట పట్టణాల్లో ఉన్న ఈ బెట్టింగ్ సంస్కృతి ఇప్పుడు పల్లెల్లోనూ జోరుగా సాగుతోంది. చిత్తూరు, పలమనేరు, పెనుమూరు, జీడీనెల్లూరు, పుంగనూరు, పాకాల, వి.కోట, కుప్పం ప్రాంతాల్లో బెట్టింగులు ఎక్కువగా జరుగుతాయి. బెంగళూరులోని పెద్ద బుకీల వద్ద లైన్ అకౌంట్లు తీసుకుని స్థానికంగా లాడ్జీలు, ప్రైవేటు హోటళ్లు, అద్దె భవనాల్లో పోలీసుల కళ్లుకప్పి బెట్టింగులు నడుపుతున్నారు.

తల్లిదండ్రులే పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి

బెట్టింగ్ నిర్వహించడంతో పాటు ఆడడంపై ప్రత్యేక నిఘా పెట్టాం. బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారం ఇస్తే వారిపై చర్యలు చేపడతాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.బెట్టింగ్‌తో జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నా యువత మారడం లేదు.తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఓ కన్నేసి ఉంచితే మేలు.

- సాయినాథ్, చిత్తూరు డీఎస్పీ

ఉత్తమ, సేవా పతకాలకు 10మంది ఎంపిక



డీఎస్పీ మహబూబ్ బాషా - సీఐ మనోహర్ - హెడ్‌కానిస్టేబుల్ మునిరత్నం

చిత్తూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండగను పురస్కరించుకుని పోలీసు అధికారులు, సిబ్బందికి ఏటా ప్రకటించే ఉత్తమ సేవా పతకాలకు జిల్లా నుంచి పది మంది అధికారులు, సిబ్బందిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎంపికైన వారి పేర్లను శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ సేవా పతకానికి చిత్తూరు క్రైమ్ పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.కె.మునిరత్నం ఎంపికయ్యారు. సేవా పతకాలకు ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఎస్బీ సీఐ మనోహర్, ఏఎస్ఐ దేవరాజులు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, నియామతుల్లా, బాలాజి, కానిస్టేబుళ్లు హరిబాబు, మణిగండన్ ఎంపికయ్యారు. పతకాలకు ఎంపికైన సిబ్బందిని మణికంఠ అభినందించారు.

ఇంటెలిజెన్స్ హెచ్‌సీకి సీఎం శౌర్యపతకం



తులసిరాజ్

పలమనేరు, మార్చి21 (ఆంధ్రజ్యోతి) :ఉగాది పండగను పురస్కరించుకుని పోలీసు శాఖ ప్రకటించిన ముఖ్యమంత్రి శౌర్య పతకానికి పలమనేరులో ఇంటెలిజెన్స్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తులసిరాజ్ ఎంపికయ్యారు.

నేడు కేసులపై హైకోర్టు జడ్జి సమీక్ష

చిత్తూరు లీగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి శనివారం చిత్తూరు జిల్లా కోర్టు ప్రాంగణానికి రానున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఉమ్మడి చిత్తూరుజిల్లా పరిధిలో ఉన్న న్యాయమూర్తులతో కేసులకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎట్టకేలకూ కదిలారు

- డీసీసీబీపై సెక్షన్ 51 కింద విచారణ ప్రారంభం
- తొలివిడతలో 50మందికి నోటీసులు జారీ

డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న డీఆర్వో మోహన్ కుమార్



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్రబ్యాంకులో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో భారీగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని రాష్ట్రప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది.డీసీసీబీలో అక్రమాలకు సంబంధించి ఆంధ్రజ్యోతిలో గత ఏడాది జూలై 11న డీసీసీబీలో దారుణాలు, జూలై 12న అక్రమాలకు సింగిల్ విండో శీర్షికన కథనాలు ప్రచురితమయ్యాయి. నవంబరు 13న మరో కథనం వచ్చింది. మరోవైపు టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు గత పాలకవర్గం చేసిన ఆర్థికవిధ్వంసంపై అక్టోబరు 10న ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సహకారచట్టం-51 ప్రకారం విచారణ జరిపి నివేదిక పంపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించింది.దీంతో విచారణాధికారిగా డీఆర్వో మోహన్ కుమార్‌ను కలెక్టర్ నియమిస్తూ 120 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అప్పటి నుంచి ఇంతవరకు ప్రాథమిక చర్యలు చేపట్టిన డీఆర్వో శుక్రవారం నుంచి రోజువారీ విచారణ ప్రారంభించారు. ఏప్రిల్ 9వ తేదివరకు విచారణ జరుగుతుందని, హాజరుకావాలంటూ ఈ కేసుకు సంబంధించిన 50 మందికి నోటీసులు జారీ అయ్యాయి. తొలి విడతగా శుక్రవారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో డీఆర్వో విచారణ చేపట్టారు. కొందరు సిబ్బందిని విచారించారు.తొలివిడత విచారణ జరిగినతర్వాత అవసరమైతే రెండో విడతలో మరికొందరిని విచారణకు పిలిచే అవకాశం ఉంది.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్‌గా స్విమ్స్!

● పరిశీలించాలంటూ సీఎంకు వినతి



తిరుమల, ఆంధ్రజ్యోతి: రాయలసీమకే తలమానికమైన స్విమ్స్ ఆస్పత్రిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా పరిగణించే అంశంపై పరిశీలించాలని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. శ్రీవారి దర్శనం అనంతరం తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో సీఎంను కలిసిన ఆయన అందుకు సంబంధించిన ప్రాజెక్ట్ నివేదికను అందజేశారు. దీనిపై బోర్డులో తీర్మానం కూడా చేసి ప్రభుత్వానికి పంపామని తెలిపారు.

సాంకేతిక లోపంతో ఆగిన మెమూ రైలు

దొరవారిసత్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న మెమూ రైలు ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో శుక్రవారం సాయంత్రం దొరవారి సత్రం మండలం కలగుంట సమీపంలో ఆగిపోయింది. దీంతో ఆ మార్గంలో చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లను నిలిపివేశారు. రాత్రి 7గంటలకు ధన్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కున్న మరో ఇంజిన్‌ను తీసుకెళ్లి ఆగిపోయిన మెమూ రైలును దొరవారిసత్రం రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి లూప్‌లైన్‌లో ఉంచారు. తరువాత రాత్రి 7:30 గంటల తరువాత రైళ్ల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.



కలగుంట సమీపంలో ఆగిపోయిన మెమూ రైలు


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.71 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,872

తలనీలాలు సమర్పించినవారు: 23,523





| పల్లెలకు నిరంతరం.. రక్షిత మంచినీళ్లు అందించడమే లక్ష్యం |

నీళ్లే జీవం. నీళ్లే అభివృద్ధికి మూలం. అలాంటి మంచినీటి ప్రాముఖ్యతపై దృష్టి కేంద్రీకరించడానికి, నీటి వనరుల నిర్వహణపై చర్చించడానికి.. ఏటా మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహిస్తుంటారు.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

తాగే నీళ్లు బాగుంటే.. చాలావరకు అనారోగ్య సమస్యలు దూరమైనట్లే. అందుకనే ప్రభుత్వం రక్షిత మంచి నీటి సరఫరాకు చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా శుద్ధి నీటిని అందించే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ తీసుకొచ్చింది. దీనికి ప్రస్తుత ప్రభుత్వం సమూల మార్పులు చేస్తోంది. కొళాయిల ద్వారా 365 రోజులూ తాగునీరు సరఫరా అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సమీప జలాశయాలు, నదుల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తరలించి వేసవిలోనూ ప్రజలకు నీటిని సరఫరా చేసేలా డిజైన్లను మార్చుతోంది. రాష్ట్రస్థాయి అంచనాల కమిటీ ఆమోదంతో వాటిని త్వరలో కేంద్రానికి పంపనుంది. ఇక, జిల్లా విషయానికొస్తే.. చంద్రగిరి, నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 3,67,762 ఇళ్లున్నాయి. ఇందులో 3,45,008 ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 22,754 నీటి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వంలో ఇలా కొళాయి కనెక్షన్లు ఇచ్చారే కానీ పూర్తిస్థాయిలో నీటిని అందించలేదు. జలజీవన్ మిషన్ కింద గత ప్రభుత్వంలో రూ.107.73కోట్లు విడుదల కాగా, రూ.65.32కోట్లు ఖర్చు చేశారు. పూర్తిస్థాయిలో రూరల్ ప్రాంతాలకు నీటిని అందించాలన్న ప్రధాన ఉద్దేశ్యంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నీటి సరఫరా అందనని చోట నీరు అందేలా చర్యలు చేపడుతోంది. నీటి సరఫరా అందని పైపులైన్లకు సమీపంలో ఉన్న నీటి వనరుల ద్వారా నీటిని అందిస్తోంది. ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లుతో పాటు 31 మండలాల్లో ఈ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ తాత్కాలికంగా నీటి సరఫరా జరుగుతోంది. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రతిరోజు నీటిని అందించాలనే ఉద్దేశంతో రెండు కొత్త పథకాలకు రూపకల్పన చేస్తున్నారు. గండికోట రిజర్వాయర్, కండలేరు జలాశయాల ద్వారా నిరంతరం నీటిని అందించే ప్రక్రియకు డీపీఆర్‌ను సిద్ధం చేసి సంబంధితశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించగానే పనులను చేపట్టి జలజీవన్ మిషన్ ద్వారా పూర్తిస్థాయిలో నీటిని అందించనున్నారు. వేసవిలో ఇబ్బందులు ఏర్పడితే వాటికోసం కూడా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి 215.42లక్షలతో ప్రతిపాదనలు పంపారు.

పూర్తిస్థాయిలో నీటిని అందించాలన్నదే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాలకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా పూర్తిస్థాయిలో ఇంటింటికి తాగునీటిని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లకు సంబంధించి ఉన్నతాధికారులు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆమోదముద్ర పడిన వెంటనే గండికోట, కండలేరు జలాశయాల ద్వారా నిరంతరం నీటిని అందించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుంది.

- ఆర్.భాస్కర్‌రెడ్డి, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఆపరేషన్ గరుడ

● జిల్లాలో నాలుగు మెడికల్ షాపులపై అధికారుల దాడులు.. ఒకదానిపై కేసు నమోదు



తిరుపతిలోని మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ గరుడ' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నాలుగు మెడికల్ షాపులపై శుక్రవారం అధికారులు దాడులు నిర్వహించారు. తిరుపతిలో విజిలెన్సు సీఐలు నిరంజన్ నాయుడు, చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు, విజిలెన్సు, ఈగల్, డ్రగ్ కంట్రోల్ బృందాలు దాడులు జరిపాయి. తిరుపతి నగరం ప్రకాశం రోడ్డులోని గురుజ్యోతి మెడికల్ షాపులో మత్తుకోసం వాడే 15 రకాల నార్కోటిక్ డ్రగ్స్ మందులను డాక్టర్ల అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. సేల్ బిల్ వాయిస్‌లు సీజ్ చేసినట్లు సీఐ నిరంజన్ చెప్పారు. ఆ దుకాణంపై కేసు నమోదు చేస్తున్నట్లు విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ తెలిపారు. అలాగే దొడ్డాపురం వీధిలోని హోల్‌సేల్, రిటైల్ సాయి మార్కెటింగ్, అక్కడే ఉన్న సాయి మార్కెటింగ్ మెడికల్స్ అండ్ ఫ్యాన్సీ స్టోర్, రెడ్డి, రెడ్డి కాలనీలోని ఎస్వీ అపోలో ఫార్మసీ మందుల దుకాణాలపై దాడులు చేశారు. ఇక్కడా ఫార్మాసిస్టులు లేకుండా మందులు విక్రయించడం, కొన్ని నార్కోటిక్ మందులను డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఈ దాడులు నిరంతరం కొనసాగిస్తామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ చెప్పారు. ఎక్కడైనా నకిలీ మందులు, యువత, మహిళలు, రోగులు, ప్రజలకు మత్తు కలిగించే మందులు అనుమతి లేకుండా స్టాకు ఉంచినా, విక్రయించినా, డాక్టర్ల అనుమతి లేకుండా అక్రమంగా దాచి ఉంచిన మందులు విక్రయాలు జరిపినా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే మందుల దుకాణాల లైసెన్సులు రద్దు చేయడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు.

ఇకపై గంట ముందే పరీక్షా కేంద్రంలోకి అనుమతి

● ఎండ నుంచి ఉపశమనంకోసం నిర్ణయం



చంద్రగిరిలోని ఓ పరీక్షా కేంద్రం బయట ఎండలో వేచిఉన్న పదో తరగతి విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులను ఇకపై గంట ముందే కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. ఇప్పటి వరకు అరగంట ముందే అనుమతించేవారు. ఎండల నేపథ్యంలో ఉదయం 8.30 గంటల నుంచే అనుమతించేలా నిర్ణయం తీసుకున్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పదోతగతి పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులు ముందుగానే ఆయా కేంద్రాల వద్దకు చేరుకుంటున్నారు. వీరిని అర గంట ముందుగా.. అంటే 9 గంటలకు ఆయా కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు. ముందుగానే వచ్చిన విద్యార్థులు అప్పటి వరకు బయటే ఉంటున్నారు. ఇప్పుడు ఉదయాన్నే ఎండ తీవ్రంగా ఉంటోంది. దీంతో విద్యార్థులు ఎండకు ఇబ్బంది పడుతూ ఉండటాన్ని గమనించిన డీఈవో కేవీఎన్ కుమార్.. గంట ముదుగానే పరీక్ష కేంద్రంలోకి అనుమతించేందుకు నిర్ణయించారు. ఆమేరకు విద్యాశాఖాధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ప్రశాంతంగా పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు ఎండ బారినపడకుండా ఉండేందుకు ఇలా వెసులుబాటు కల్పించామని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

సత్యవేడులో టెన్త్ విద్యార్థి డీబార్

● ఇన్విజిలేటర్ సస్పెన్షన్

తిరుపతి(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి): సత్యవేడులో కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థిని అధికారులు డీబార్ చేశారు. ఇన్విజిలేటర్ ఎస్.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు. శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. అనుమానంతో ఓ విద్యార్థిని తనిఖీ చేయగా చిట్టీలు ఉండటంతో డిబార్ చేశారు. ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. ఈ ఘటన మినహా జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా సాగాయని డీఈవో తెలిపారు.

26,617 మంది హాజరు : జిల్లాలో శుక్రవారం జరిగిన ఆంగ్ల భాషా పరీక్షకు జిల్లావ్యాప్తంగా 26,617 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో కుమార్ వెల్లడించారు. రెగ్యులర్ విద్యార్థులు 26,840, ప్రైవేటు విద్యార్థులు 57 మంది పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా రెగ్యులర్ విద్యార్థులు 252 మంది, ప్రైవేటు విద్యార్థులు 28 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 966 మందికిగాను 133 మంది గైర్హాజరయ్యారు.

ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా

బరితెగిస్తున్న మాఫియా

మంగళంపాడు పొలాల్లో గుట్టలు గుట్టలుగా నిల్వలు



మంగళంపాడు పొలాల వద్ద ఇసుక నిల్వలు - ఇసుక అక్రమ రవాణాకు పొలాల్లో ఏర్పరచిన దారి

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఉచితం మాటున రెండు వారాల నుంచి కాళంగి నదిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇష్టానుసారం సాగిన ఇసుక తవ్వకాలు ప్రభుత్వం మారడంతో ఆగినట్లే కనిపించాయి. అయితే వైసీపీ హయాంలోని ఇసుక మాఫియాలో కొందరు అధికార పార్టీ నాయకులతో సంబంధాలు పెట్టుకొని అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కాళంగి నదిలో రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇసుక తవ్వేస్తున్నారు. ఇందుకోసం మంగళంపాడు పొలాల్లో దారి ఏర్పరచుకొని దొరవారిసత్రం మండలం ఉచ్చూరు సమీపంలోని గుమ్మడితాగేలి వద్ద కాళంగి నదిలో ఇసుకు తవ్వి నిత్యం ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాత్రివేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించి డంపింగ్ చేసుకొంటున్నారు. అక్కడ నుంచి సమీపంలోని పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు సరఫరా చేసి జేబులు నింపుకొంటున్నారు. వారం రోజుల క్రితం మంగళంపాడులో కొందరు రైతులు తమ పొలాల మీదుగా ఇసుకను తరలించొద్దని అడ్డుపడ్డారు. పోలీసులకు, ఆర్డీవో కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్ర వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం అర్ధరాత్రి పూట ఇసుక మాఫియా నాయకులు ఓ రైతు ఇంటికి వెళ్లి దుర్భాషలాడి దాడిచేసేందుకు ప్రయత్నించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నామమాత్రపు కేసులు కట్టి చేతులు దులుపుకొన్నారనే విమర్శలున్నాయి. ఇసుక అక్రమ రవాణాతో పొలాలు దెబ్బతినడంతో రైతులు అభ్యంతరం చెప్పిన అధికారులకు అక్రమార్కులకు వంతపాడుతూ సర్దుకుపోండి అంటూ నచ్చచెప్పడం గమనార్హం.

కేజే కృష్ణమూర్తి కన్నుమూత

● టీటీడీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్‌గా విశేష సేవలు

● టీటీడీ మహా భారత ప్రాజెక్టుకూ విశిష్ట కృషి

● ఎస్వీయూ ఓఆర్‌ఐ డైరెక్టర్‌గానూ బాధ్యతల నిర్వహణ



కేజే కృష్ణమూర్తి (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కేజే కృష్ణమూర్తి (90) కన్నుమూశారు. కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం సుంకేసుల ఈయన స్వగ్రామం. ఎస్వీ ఓరియెంటల్ కాలేజీలో విద్వాన్ చదువుకోవడానికి తిరుపతికి వచ్చారు. ఎస్వీయూ తెలుగు విభాగంలో ఎంఏ తెలుగు కోర్సును ప్రైవేటుగా పూర్తి చేశారు. ఓరియెంటల్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేశారు. నంద్యాలలోని ఓ హైస్కూల్లో పదేళ్లు తెలుగు పండితుడిగా పని చేశారు. తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై ప్రొఫెసర్ జీరెడ్డి చెన్నారెడ్డి పర్యవేక్షణలో ఎస్వీయూ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్‌ఐ) విభాగంలో అధ్యాపకుడిగా చేరారు. ఓఆర్‌ఐ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు. 1996 లో పదవీ విరమణ పొందారు. 1996-2000 మధ్య కాలంలో టీటీడీ మహా భారత ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. 2004లో టీటీడీ ఏర్పాటు చేసిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా సేవలందించారు. తరిగొండ వెంగమాంబ రాసిన అనేక రచనలను పరిష్కరించారు. వీటిలో ముఖ్యంగా, వేంకటాచల మహాత్మ్యం, ద్విపద భాగవతం, యక్షగానాలు వంటివి ఆయన ద్వారా వెలుగులోకి వచ్చాయి. కేజే కృష్ణమూర్తి సతీమణి నాగసుదర్శనమ్మ 2004లో మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు శ్రీధర్ ఎస్వీ ఎస్ కాలేజీలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా, పార్థసారథి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈయన సోదరుడు జూలకంటి బాలసుబ్రమణ్యం సప్తగిరి పత్రిక సంపాదకుడిగా పని చేశారు. కపిలతీర్థం రోడ్డులోని రామచంద్ర నగర్‌లో నివాసమున్న కేజే కృష్ణమూర్తి, ఆరు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో కన్నుమూశారు. శనివారం ఉదయం 11 గంటలకు హరిశ్చంద్ర శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.





విమానాశ్రయంలో సీఎంకు వీడ్కోలు పలుకుతున్న డీఐజీ, కలెక్టర్, ఎస్పీ

సీఎంకు సాదర వీడ్కోలు

రేణిగుంట, మార్చి 21, (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు. శుక్రవారం మనవడు దేవాన్ష్ జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న అనంతరం తిరుమల నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రికి తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, భానుప్రకాష్, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టీటీడీ ఈవో శ్యామల రావు, డీఐజీ షిమోషీ బాజ్‌పాయి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు వీడ్కోలు పలికారు.

తిరుమలలో ఆగిన ఆఫ్‌లైన్ అద్దె చెల్లింపులు

తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆఫ్‌లైన్ ద్వారా జరిగే అద్దె చెల్లింపులు ఆగిపోయాయి. టీటీడీకి చెందిన నివాసగృహాలు, కార్యాలయాలు, దుకాణాలు, హాకర్ లైసెన్సుల అద్దెతో పాటు కరెంటు, నీటి బిల్లులను తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ద్వారా ఆఫ్‌లైన్‌లో చెల్లిస్తుంటారు. దుకాణాల అద్దె ద్వారా రోజుకు సుమారు రూ.40 లక్షలు, విద్యుత్ బిల్లుల ద్వారా రూ.20 వేల నుంచి రూ.30 వేలు (చివరి తేదీ అయితే రూ.లక్ష) వరకు వసూలు అవుతుంటుంది. ఇక నివాసగృహాలు, కార్యాలయాలు, మఠాల నీటి బిల్లులు నెలకు దాదాపు రూ.20 లక్షల వరకు చెల్లిస్తుంటారు. ఆన్‌లైన్‌లోనే చెల్లించాలనే నిబంధనతో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఈ కౌంటర్‌లో ఉన్న సిస్టమ్‌కు గురువారం నుంచి యాక్సెస్‌ను కట్ చేశారు. దీంతో కౌంటర్ వద్దకు బిల్లులు చెల్లించేందుకు వెళ్లిన వారికి ఆఫ్‌లైన్ ద్వారా కట్టించుకోవడం లేదని సిబ్బంది చెప్పి పంపేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు తెలియని అనేక మంది ఆగచాట్లు పడుతున్నారు. కొందరు బిల్లుల కంటే అధికంగా చెల్లించి ఇతరుల వద్ద బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమలలో వ్యాపారాలు చేసేవారిలో చాలా మంది చదువుకోని వారే ఉండటంతో ఆన్‌లైన్‌లో బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. మరి కొందరు తమ బిల్లులు కట్టించుకోవాలని కౌంటర్ చుట్టూ తిరుగుతున్నారు.



ఆఫ్‌లైన్ ద్వారా కట్టించుకోవడం లేదని బిల్లు చూపిస్తున్న స్థానికుడు

పని ఒత్తిడి తగ్గించండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలని జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వేలు, పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సెలవు, పండుగ రోజుల్లోనూ సర్వేలు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపశమనం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు జి.శ్రీనివాసులు, గిరిధర్ రెడ్డి, మాధవి, రాజేష్, నాగవేణి, బాబునాయుడు, దుష్యంత్‌రెడ్డి, మధు, బాలాజీ పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు



అంత్యక్రియలకు వెళ్లొస్తుండగా ట్రాక్టర్ బోల్తా

37మంది యనమలమంద కాలనీవాసులకు గాయాలు

ముగ్గురి పరిస్థితి విషమం



వెదురుకుప్పం/శ్రీరంగరాజుపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు వెళ్లొస్తుండగా, అదుపు తప్పి ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో 37 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లె (అరసేనుపల్లె)కాలనీకి చెందిన చిన్నక్క(70) గురువారం అనారోగ్యంతో చనిపోయింది. ఆమె మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. ఈ నేపథ్యంలో వెదురుకుప్పం మండలం యనమలమంద కాలనీకి చెందిన బంధువులు సుమారు 40మందికి పైగా ఓ ట్రాక్టరులో స్వగ్రామం నుంచి అరసేనుపల్లెకి వెళ్లారు. అంత్యక్రియలు పూర్తయ్యాక అదే ట్రాక్టరులో స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లె సమీపానికి వచ్చేసరికి ట్రాక్టరు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ఉన్న 40 మందికిపైగా చెల్లాచెదురుగా కిందపడ్డారు. వీరిలో 37 మంది గాయపడ్డారు.



ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లె సమీపంలో బోల్తాపడ్డ ట్రాక్టరు - క్షతగాత్రులు



క్షతగాత్రుల వివరాలిలా..



ఎస్.చిన్నమ్మ(58), ఎస్.పండమ్మ(62), ఎ.చిన్నమ్మ(62), సుశీలమ్మ(64), ఎస్.మురగమ్మ(54), శ్యామల(46) తీవ్రంగా గాయపడ్డారు. కె.మురగమ్మ(48), ఎం.సుమతి(45), ఎం.బుడిగమ్మ(64), మీర(34),



అముద(54), విజయ(52), సంపూర్ణమ్మ(66), తులసమ్మ(32), శ్యామల(40), కస్తూరి(48), శ్రావణి(35), నీల(28), ప్రేమలత(28), చెంగమ్మ(58), మరో 15 మంది గాయపడ్డారు. తొలుత బాధితులందరికీ ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీలో డాక్టర్ హర్షవర్ధన్ నేతృత్వంలో సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. తర్వాత చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి 108 అంబులెన్స్‌లలో తరలించారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో 26 మంది చికిత్స పొందుతున్నారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.

సకాలంలో చేరుకోని 108 అంబులెన్స్‌లు



పీహెచ్‌సీ వద్ద 108 అంబులెన్స్‌ల కోసం ఎదురుచూస్తున్న బాధితుల బంధువులు

108 అంబులెన్స్‌లకు సమాచారం ఇస్తే సకాలంలో ప్రమాద స్థలానికి రాలేదని క్షతగాత్రులు ఆరోపించారు. ప్రమాద స్థలం నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలోని ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీకి వివిధ వాహనాల్లో వచ్చామని తెలిపారు. పీహెచ్‌సీకి వచ్చాక కూడా సుమారు గంట తర్వాత వివిధ సమయాల్లో ఐదు 108 అంబులెన్స్ వాహనాలు వచ్చాయన్నారు. కాగా, ఎస్ఆర్‌పురంలోని 108 అంబులెన్స్ వేరే కేసు విషయంగా అందుబాటులో లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చాయని తెలిసింది.

మెరుగైన వైద్య సేవలందించండి : ఎమ్మెల్యే థామస్



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న థామస్

బాధితులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులను జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఆదేశించారు. రాత్రి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కాగా, ఐదు 108 అంబులెన్స్ వాహనాలను ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీకి రప్పించడంలోనూ థామస్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అలాగే ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే పాలసముద్రం పీహెచ్‌సీలో ఎస్ఆర్‌పురం టీడీపీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, ఎస్సీ సెల్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం సుధాకర్, మాల కార్పొరేషన్ డైరెక్టరు యుగంధర్, జీడీనెల్లూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్ర వేర్వేరుగా వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. ఎస్ఆర్‌పురం తహసీల్దార్ లోకనాథంపిళ్లై, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టరును పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. పీహెచ్‌సీ వద్దకు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మామిడి రైతులను ఆదుకోండి

● పార్లమెంటులో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చిత్తూరుసిటీ, మార్చి21(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి పార్లమెంటులో జరుగుతున్న బడ్జెట్ సమావేశాలకు హాజరైన ఆయన శుక్రవారం జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా మామిడి పంటకు ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న మామిడి రైతులను ఆదుకోవాలని కోరారు. మామిడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఇతర దేశాలకు ఎగుమతి చేసే మామిడి గుజ్జుపై పన్నును తగ్గించాలన్నారు. వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం చూస్తుంటే అన్నదాతలపట్ల ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కున్న చిత్తశుద్ధి తెలుస్తోందని అన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదేనన్నారు. జై జవాన్.. జై కిసాన్ అనే నినాదంతో ఎన్డీయే సర్కార్ పనిచేస్తోందని ప్రశంసించారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగం

● గుండ్లకట్టమంచి పూర్వ కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదుపై కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారణ జరిపించారు. దాని ఆధారంగా ఆ గ్రామ పూర్వ పంచాయతీ కార్యదర్శి జేజీ ఉమాపతిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇతను ఇదే మండలంలోని సంక్రాంతిపల్లె కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇతడి వద్ద నుంచి రెవెన్యూ రికవరీ చట్టం కింద దుర్వినియోగమైన రూ.3,68,441ను నిధులను రికవరీ చేయాలని బంగారుపాళ్యం తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇదే అంశంపై సర్పంచ్ జి.శ్రీనివాసులుకు షోకాజ్ నోటీసు జారీచేశారు. నోటీసు అందుకున్న వారం రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు.

అధిక పనిభారం నుంచి తప్పించండి

● డీపీవోకు పంచాయతీ కార్యదర్శుల మొర

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): 'మేము మరమనుషులం కాదు.. 38 రకాల సర్వేలు చేస్తున్నా.. మాపై అపనిందలా.. అధిక పనిభారం నుంచి తప్పించండి' అంటూ పంచాయతీ కార్యదర్శులు మొర పెట్టుకున్నారు. రాష్ట్ర కమిటీ సూచనలతో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు శుక్రవారం డీపీవో సుధాకరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. తీవ్ర పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా అధ్యక్షుడు బి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.బెనహర్, ఉపాధ్యక్షుడు డి.సుభాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు బాలాజీకి గీతాంజలి స్మారక పురస్కారం

పలమనేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎరుకల కథాసంపుటి 'ఏకలవ్య కాలనీ' రచయిత పలమనేరు బాలాజీ గీతాంజలి స్మారక సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కరణం విమల బాలాజీకి వివరాలు తెలియజేశారు.

తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. హార్దిక్ పీటర్స్ అనే వ్యక్తి మెయిల్ ఐడీ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ అధికార మెయిల్ ఐడీకి శుక్రవారం ఓ సందేశం వచ్చింది. కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు మెసేజ్ ఉండడంతో ఎస్పీ హర్షవర్ధనరాజుకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు ఏఎస్పీ రవి మనోహరాచారి నేతృత్వంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు కలెక్టరేట్‌కు చేరుకుని సెల్లార్ నుంచి ఏడవ అంతస్తు వరకు 2 గంటల పాటు తనిఖీ చేశారు. బాంబు ఆనవాళ్లు దొరక్కపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల తనిఖీలతో ఉద్యోగులు, అధికారులు కొంతసేపు హైరానాపడ్డారు. గతంలో పలు హోటళ్లకు సైతం ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం విదితమే.

వాటర్ ట్యాంకులను శుభ్రం చేయండి:కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకులను ఈ నెలాఖరులోగా శుభ్రం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. వేసవిలో తాగునీటి సరఫరాపై కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమీక్షించారు. 15 రోజుల వ్యవధిలో రవాణా ద్వారా నాలుగు హేబిటేషన్లు, టైఅప్ ద్వారా మూడు హేబిటేషన్లకు తాగునీటి సరఫరా చేపట్టామన్నారు. 308 చేతిపంపులు మరమ్మతులకు గురవగా, 233 సరిచేశామని చెప్పారు. లీకేజీకి గురైన 190 పైపులైన్లను, 221 పంపుసెట్లను సంబంధిత శాఖల అధికారులు మరమ్మతులు చేశారని వివరించారు.జడ్పీ సీఈవో రవికుమార్, డీపీవో సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి నిధులు : గతంలో గృహ నిర్మాణాలు చేపట్టి నిధుల్లేక అసంపూర్తిగా నిలిచిపోయినవాటికి ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో సమీక్షించిన ఆయన అర్ధంతరంగా నిలిచిన 16406 మంది గృహాల లబ్ధిదారులను గుర్తించి.. 6388 మందికి రూ.9.20కోట్లను ఆర్థికసాయంగా అందించామన్నారు. మిగిలినవారిని కూడా గుర్తించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పాలారుపై చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు రూ.10.24 కోట్లు

కుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ పరిధిలో పాలారు నదిపై ఉన్న నాలుగు చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకోసం ప్రభుత్వం రూ.10.24 కోట్లను మంజూరు చేసింది.నదిపై 8.8వ కిలోమీటరు వద్ద చెక్ డ్యామ్ మరమ్మతులకు రూ.1.9 కోట్లు, 12.250వ కిలోమీటరు వద్ద ఉన్న చెక్‌డ్యామ్ మరమ్మతులకు రూ.2.18 కోట్లు, 13.9వ కిలోమీటరు వద్ద ఉన్న చెక్ డ్యామ్ మరమ్మతులకు రూ.1.71 కోట్లు ,429.5వ కిలోమీటరు వద్ద కుప్పం మండల పరిధిలోని చెక్ డ్యామ్ పునర్నిర్మాణానికి రూ.4.45 కోట్లు మంజూరయ్యాయి.

టెన్త్ పరీక్షలకు 623 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలకు శుక్రవారం 623 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.ఓపెన్ స్కూల్ పరీక్షలకు 297మంది గైర్హాజరయ్యారు.ఆర్జేడీ శామ్యూల్ పలు టెన్త్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పూతలపట్టులో ఒక ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించారు.

నీటికోసం జనావాసాల్లోకొచ్చిన జింక

పీవీకేఎన్ కళాశాల గేటులో చిక్కుకోగా కాపాడిన అటవీ సిబ్బంది



చిత్తూరు సెంట్రల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నీటికోసం అటవీ ప్రాంతం నుంచి ఓ జింక శుక్రవారం జనావాసాల్లోకి వచ్చింది. స్థానిక రెడ్డిగుంట మీదుగా పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకొచ్చింది. దీన్ని చూసిన కుక్కలు వెంటపడటంతో భయపడిన జింక పరుగులు తీసే క్రమంలో కళాశాల గేటులో చిక్కుకుంది. స్థానికులు వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని జింకను కాపాడి, ప్రాథమిక చికిత్స చేయించారు. ఆ తర్వాత అటవీ ప్రాంతంలోకి విడిచిపెట్టినట్లు తూర్పు డివిజన్ ఎఫ్ఆర్వో థామస్ తెలిపారు.

మూడు మండలాల్లో 39 డిగ్రీలు



చిత్తూరులో ఎండకు బోసిపోయిన గాంధీ సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సూరీడు మండిపోతున్నాడు.ఎండతీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటలకే బయట కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది.శుక్రవారం అత్యధికంగా నింద్రలో 39.5, నగరిలో 39.4, గుడిపాలలో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన మండలాల విషయానికొస్తే తవణంపల్లెలో 38.9డిగ్రీలు , శ్రీరంగరాజపురంలో 38.1, గంగవరంలో 37.6, గుడుపల్లిలో 36.8, పులిచెర్లలో 36.8, వెదురుకుప్పంలో 36.6, చిత్తూరులో 36.4, బంగారుపాళ్యంలో 36.3, సదుంలో 36.3, గంగాధరనెల్లూరులో 36, చౌడేపల్లిలో 35.8, ఐరాలలో 35.8, పాలసముద్రంలో 35.8, విజయపురంలో 35.8, పూతలపట్టులో 35.4, రొంపిచెర్లలో 35.4, పలమనేరులో 35.3, పెనుమూరులో 35.3, శాంతిపురంలో 35, సోమలలో 34.9, యాదమరిలో 34.9, పెద్దపంజాణిలో 34.8, వి.కోటలో 34.5, కార్వేటినగరంలో 33.2, కుప్పంలో 33.1, బైరెడ్డిపల్లిలో 32.9, రామకుప్పంలో 32.7, పుంగనూరులో 32.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'పల్లె పండగ'కింద 151.98 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా 207.58 కిలోమీటర్ల సీసీ రోడ్లు మంజూరయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఇందులో 151.98 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామని చెప్పారు. అమరావతి నుంచి శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పల్లె పండగ, ఫారం పాండ్స్ నిర్మాణం, ఉపాధి హామీ పథకం అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. చిత్తూరు నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. 12,984 ఫారంపాండ్స్ నిర్దేశించగా, లక్ష్యానికి మించి 17009 మంజూరు చేయడం జరిగిందన్నారు. 2938 గ్రౌండింగ్ చేయగా.. 1283 పూర్తి చేశామని డిప్యూటీ సీఎంకు వివరించారు. డ్వామా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో గరుడ టీమ్ తనిఖీలు

చిత్తూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ గరుడలో భాగంగా శుక్రవారం చిత్తూరు నగరంలో పలు మెడికల్ షాపులను గరుడ టీమ్ సభ్యులు తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ పర్యవేక్షణలో డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మెడికల్ షాపులపై దాడులు నిర్వహించారు. మురకంబట్టు వద్ద ఉన్న మెడ్‌ప్లస్ మెడికల్‌షాపు, దర్గా, కొంగారెడ్డిపల్లె వద్ద ఉన్న అపోలో మెడికల్ షాపుల్లో బిల్లులు లేకుండా, డాక్టర్ల రసీదు లేకుండా అమ్మకూడని మందులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి తెలిపారు. ఈ దాడుల్లో డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కీర్తన, లా అండ్ ఆర్డర్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, ఎస్ఐ అనిల్‌కుమార్, విజిలెన్స్ సీఐ వెంకటరి, తదితరులు పాల్గొన్నారు.

తల్లి డబ్బులివ్వలేదని కుమారుడి ఆత్మహత్యాయత్నం

పోలీసులు సకాలంలో స్పందించడంతో తప్పిన ప్రాణాపాయం



సీఎంసీలో చికిత్స పొందుతున్న లోకేష్

యాదమరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తల్లి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో కుమారుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని జోడిచింతల వద్ద దేవమ్మ ఓ హోటల్ నడుపుతున్నారు. ఈమెకు హరి, లోకేష్ అనే ఇద్దరు కుమారులున్నారు. తన ఇంటిని తనఖా పెట్టి పెద్ద కుమారుడు హరికి డబ్బులు ఇచ్చింది. రెండో కుమారుడు లోకేష్ కూడా తనకు డబ్బులివ్వాలని తల్లిని అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో తాను పురుగుల మందు తాగి చనిపోతున్నట్లుగా ఓ వీడియో తీసి కుటుంబీకులకు పంపి, తన మొబైల్‌ను స్విచాఫ్ చేశాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సాంకేతికతను ఉపయోగించి లోకేష్ మొబైల్ లొకేషన్ ఆధారంగా మోర్దానపల్లి అమర్‌రాజ ఫ్యాక్టరీ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించగా.. అప్పటికే లోకేష్ స్పృహ కోల్పోయి న్నాడు. వెంటనే అతడిని పోలీసు వాహనంలోనే సీఎంసీ ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

ఆ ఇద్దరు టీచర్లూ మాకొద్దు

విద్యాశాఖ అధికారులతో విద్యార్థుల తల్లిదండ్రులు



విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈవోల సమావేశం

గంగవరం,మార్చి21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల పట్ల వికృత చేష్టలకు పాల్పడిన ఆ ఇద్దరు ఉపాధ్యాయులు వద్దని మండల విద్యాశాఖ అధికారుల ఎదుట గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. గంగవరం మండలంలోని మామడుగు హైస్కూల్లో విద్యార్థినుల పట్ల ఇద్దరు టీచర్లు అసభ్యంగా ప్రవర్తించారంటూ గోవిందశెట్టిపల్లె గ్రామస్తులు పెద్దసంఖ్యలో హైస్కూల్ వద్దకు గురువారం తరలివచ్చి ఆగ్రహం వ్యక్తంచేసిన విషయం విదితమే. ఈ ఘటనపై ఎంఈవోలు వేణుగోపాల్, శ్రీనివాసులు శుక్రవారం మామడుగు హైస్కూల్లో విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశమై వి వరాలు సేకరించారు. ఆ ఇద్దరు ఉపాధ్యాయులను కొనసాగిస్తే , హైస్కూల్‌తో పాటు తమ గ్రామానికి కూడా చెడ్డపేరు వస్తుందని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఫిర్యాదు చేయడం లేదన్నారు.విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సహకరించాలని అధికారులకు విన్నవించారు. ఎంఈవోలు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆవేదనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

ఒకేసారి ఎన్నికలతో సమయం, ధనం ఆదా..!

యువజన పార్లమెంట్ కార్యక్రమంలో విద్యార్థుల వాణి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు - ప్రసంగిస్తున్న విద్యార్థిని

చిత్తూరు సెంట్రల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఒకేదేశం.. ఒకే ఎన్నికతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని పలువురు విద్యార్థులు చెప్పుకొచ్చారు. చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం భారత ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 18 డిగ్రీ కళాశాలలతో పాటు పలు ఇంజనీరింగ్ కళాశాలలకు, యూనివర్సిటీలకు చెందిన 115మంది విద్యార్థులు పాల్గొన్నారు. 75 మంది విద్యార్థులు వారి అభిప్రాయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.రకరకాల ఎన్నికలు వివిధ సమయాల్లో నిర్వహించడం ద్వారా సమయం వృధా కావడంతో పాటు ప్రభుత్వ ధన నష్టం, ఎన్నికల విధులకు ఉపాధ్యాయులు, అధికారులు వెళ్లిపోవడంతో విద్యావ్యవస్థలో లోటు ఏర్పడ్డం తదితర నష్టాలు జరుగుతాయన్నారు.దేశమంతటా ఒకే సారి ఎన్నికలు జరిగితే శాంతి భద్రతలు అదుపులో ఉండటంతో పాటు ఎన్నికల వ్యయం గణనీయంగా తగ్గిపోవడం వంటి ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. ఇలా ఆదా చేసిన ధనాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవచ్చన్నారు. అనంతరం వీరిలో 10 మందిని ఎంపిక చేశారు.వీరి పేర్లను కమిటీ ఆమోదం అనంతరం రాష్ట్రస్థాయికి పంపనున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త సుశీల తెలిపారు.మేయర్ అముద, సెట్విన్ సీఈవో మోహన్ కుమార్,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరానికి స్పందన



శిబిరంలో దరఖాస్తుదారులకు సూచనలిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్, పీఎస్ఎం తదితరులు

కుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు వికలత్వ ధ్రువీకరణ పత్రాల కోసం కుప్పం ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన సదరం శిబిరానికి భారీగా జనం తరలివచ్చారు. కడా ఆధ్వర్యంలో పీడీ వికాస్ మర్మత్ పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ కుప్పం మున్సిపల్, కుప్పం మండలం, గుడుపల్లె మండలాల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, బాబునాయుడు పాల్గొని ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన దివ్యాంగులను పలుకరిస్తూ వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూవచ్చారు. మూడు మండలాలకు సంబంధించి 2, 267 మంది హాజరు కాగా, ఇందులో 1,407 మంది సదరం సర్టిఫికెట్ కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కడా పీడీ వికాస్ మర్మత్, ఏపీఎస్ పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులు ఇందులో పాల్గొని, అవసరమైన వికలత్వ ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటే పింఛన్లతోపాటు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలకు ఎంతో వినియోగపడుతుందని చెప్పారు. శనివారం కుప్పం రూరల్ మండలం, కుప్పం మున్సిపాలిటీల దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేకంగా సదరం శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడవుల సంరక్షణతోనే మానవ మనుగడ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

పలమనేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు అడవులు తప్పనిసరని పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం పలమనేరు అటవీశాఖ కార్యాలయం వద్ద ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రేంజర్ నారాయణ, ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర, పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు, సామాజిక సంఘ నాయకులు శ్రీపురం సీతారామయ్య, సిద్దయ్య, సత్యప్రకాష్, అటవీ అధికారులు సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్ఎం కళాశాలలో ఐఐటీ శిక్షణ ప్రారంభం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న దయానిధి

కుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ఐఆర్ఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం ఐఐటీ, నీట్, ఎంసెట్ శిక్షణ తరగతులను ఎస్వీ గ్రూప్ అధినేత బీఎం.దయానిధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో చదువుకుంటున్న విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే 45 రోజులపాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుల్‌రాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

చౌడేపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హుండీ లెక్కింపుతో మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి రూ.76 వేలు ఆదాయం సమకూరినట్లు గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బజారులో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో మూడు నెలల తర్వాత హుండీ లెక్కింపు చేపట్టారు. ఆదాయాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ తీర్మానంతో సంబరాలు



సోమలలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సోమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పోరాటానికి అనుకూలంగా రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడంతో సోమలలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం సోమల గాంధీవిగ్రహం వద్ద ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరు మురళీ, జిల్లా కార్యదర్శి రామనాథం, జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం రాయల్, బీజేపీ మండల అధ్యక్షుడు హేమగిరి, మొగిలీశ్వర్, రవి, శుభాకర్, ప్రకాశ్, వెంకటరామయ్య, టీడీపీ నాయకులు శివశంకర్, మహేంద్రబాబు, అష్రఫ్ అలీ, రషీద్, రామకృష్ణ, రఘు, కైవారం మురళీ, పవన్, ప్రసాద్, జాకీర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో పోతనది ప్రత్యేక స్థానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు

పలమనేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో గొప్ప సహజ కవి బమ్మెర పోతన అని.. ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో తెలుగు శాఖ నిర్వహించిన భాగవతం, భక్తి, తాత్వికత, సామాజికత అనే రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు అంటే పోతన.. పోతన అంటే మహాభాగవతం అన్నారు. తిరుపతి ఓరియంటల్ రీసర్చ్ కళాశాల ఆచార్యులు పి.సి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచమే గుర్తించదగిన గొప్ప కవి పోతన అన్నారు. కార్యక్రమంలో ఆచార్య రాజేశ్వరమ్మ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ నూతన కార్యవర్గం



డివిజన్ నూతన కార్యవర్గం

పలమనేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసస్ అసోసియేషన్ పలమనేరు రెవెన్యూ డివిజన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పలమనేరులో ఎన్నుకొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ఎ.శ్యాంప్రసాద్‌రెడ్డి (ఎఫ్ఏసీ తహసీల్దార్), అసోసియేట్ అధ్యక్షులుగా గంగవరం తహసీల్దార్ ఎం. మాధవరాజు, ఉపాధ్యక్షులుగా పలమనేరు ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.పి. యోగానంద్, వి.కోట తహసీల్దార్ కార్యాలయ ఎంఆర్ఐ మోహన్‌రెడ్డి, పలమనేరు ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ తహసీన, ప్రధాన కార్యదర్శిగా పెద్దపంజాణి తహసీల్దార్ (ఎఫ్.ఎ.సీ) సీఎస్ అనిల్‌కుమార్, సహకార్యదర్శులుగా సదుం మండల డిప్యూటీ తహసీల్దారు పి.కుమార్, పుంగనూరు తహసీల్దార్ కార్యాలయ టైపిస్టు ఎస్. రాజసింహ, పలమనేరు ఆర్డీవో కార్యాలయ ఓ.ఎస్. ఎ.సుజాతమ్మ, కోశాధికారిగా పలమనేరు ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ పి. రమేష్, కార్యనిర్వాహక సభ్యులుగా పలమనేరు తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కె.దేవేంద్ర, బైరెడ్డిపల్లి తహసీల్దార్ కార్యాలయ ఎంఆర్ఐ సరిత, పెద్దపంజాణి ఎంఆర్ఐ ఆర్.రాకేష్‌లను ఎన్నుకొన్నారు. వీరి పదవీ కాలం రెండేళ్లపాటు ఉంటుందని ఎన్నికల అధికారి జీ.పీ. పార్థసారథి తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అంగన్‌వాడీ కార్యకర్తలు మెరుగైన సేవలందించాలి



చౌడేపల్లె: కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

చౌడేపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు మెరుగైన సేవలందించాలని.. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సులోచన అన్నారు. శుక్రవారం రెండోరోజు స్థానిక ఎంఆర్సీ వద్ద ఉన్న ఎంపీపీ స్కూల్‌లో మండలంలోని 66 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

● సోమల: సోమల మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణతరగతులు జరిగాయి. సూపర్‌వైజర్ హరిత సూచనలు చేశారు.

ఆంగ్ల పరీక్షకు 16 మంది గైర్హాజరు

పలమనేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని 6 పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం జరిగిన పదో తరగతి ఆంగ్ల పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారులు లీలారాణి, బాలసుందరం తెలిపారు. మండలంలో మొత్తం 1,377 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో 1,361 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు.

రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

సోమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్‌కార్డు కలిగిన కుటుంబ సభ్యులందరూ తప్పనిసరిగా ఈనెల 25వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బెన్నురాజ్ కోరారు. ప్రభుత్వం అందించే ఉచిత రేషన్ బియ్యం అందాలంటే ఈకేవైసీ చేయించాలని, అలా చేయించుకోకుంటే బియ్యం మంజూరు కావని తెలిపారు. డీలర్లు రేషన్‌కార్డుదారులకు అవగాహన కల్పించాలన్నారు.

హోటల్ భూకేటాయింపు రద్దు అభినందనీయం

● చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన రామచంద్రయాదవ్

పుంగనూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల పాదాలచెంతగల అలిపిరిలో ప్రైవేట్ హోటల్ భూకేటాయింపునకు ఇచ్చిన జీవో నెంబరు 24 రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటన చేయడం అభినందనీయమని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హోటల్ రద్దు కోసం తనతోబాటు పోరాటంలో పాల్గొన్న సాధువులు, స్వామీజీలు, శ్రీవారి భక్తులకు, జీవో రద్దు ప్రకటన చేసిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేట్ హోటల్ కోసం కేటాయించిన భూమిని వెంటనే టీటీడీకి అప్పగించి శ్రీవారి భక్తుల వసతి, సౌకర్యాల కోసం వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అంగన్వాడీ కార్యకర్తను మార్చాలి



ఫిర్యాదు చేస్తున్న కొలమడుగు గ్రామస్తులు

శాంతిపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అంగన్వాడీ టీచర్‌ను మార్చాలని కొలమడుగు గ్రామస్తులు సీడీపీవో కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అంగన్వాడీ కార్యకర్తపై గత నాలుగైదు నెలల నుంచి సీడీపీవో కల్పనకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అలాగే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారుల్లో ఎలాంటి మార్పు కనిపించక పోవడంతో గత నెలరోజుల నుంచి చిన్నారులను అంగన్వాడీ కేంద్రాన్ని తల్లిదండ్రులు పంపడం లేదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటపతి, రాజేంద్ర, శంకరప్ప, విజయ్‌కుమార్, మురళీ, సంపత్‌కుమార్, గోవిందరాజులు పాల్గొన్నారు.

దుప్పుల దాడులతో పంటల ధ్వంసం

సోమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కేంద్రంలోని ఎగువకుంట సమీప రైతుల టమోటా తోటల్లో గురువారం రాత్రి దుప్పులు స్వైరవిహారం చేసి పంటలను ధ్వంసం చేశాయి. కామిశెట్టి సోమశేఖర్ వారం క్రితం 3 వేల మొక్కలు నాటాడు. దుప్పుల కారణంగా నష్టపోయాడు. అలాగే శంకర్, లక్ష్మయ్య, మదనమోహన్ పొలాల్లోని టమోటా తోటలో పంటలను తొక్కేశాయి. తమ వేరుశనగ పంటలో నెమళ్ల కారణంగా నష్టం జరుగుతోందని రైతు సుధాకర్ వాపోయాడు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం




మాట్లాడుతున్న జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

గంగవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సామాజిక సమస్యలను ఎత్తిచూపేలా కవులు కవిత్వాలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, మాధవరెడ్డి, చంద్రశేఖరయ్య, బాలాజీ, సంస్థ కార్యదర్శి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్లు చించేశారని పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆరడిగుంట పంచాయతీలో జనసేన,టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించేశారని నాయకులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, రమేశ్‌నాయుడు, మణి, వీరభద్రస్వామి, జనసేన నాయకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా విధులు నిర్వహించాలి



సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్‌ఈ

పుంగనూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి విద్యుత్ సమస్యలపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అంకితభావంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని చిత్తూరు ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం పుంగనూరు మండలం రాంపల్లె, సుగాలిమిట్ట, మంగళం, లద్దిగం, చౌడేపల్లె మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు తనిఖీ చేశారు. ఈఈ టెక్నికల్ జగదీశ్, పుంగనూరు ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీఈ పి.శ్రీనివాసులు, ఏఈలు ధనంజయ, ఉమామహేశ్వర్, ఎస్.లలిత పాల్గొన్నారు.

కోదండరాముడికి నైవేద్యం కరువు..!

● వందెకరాల మాన్యం ఉన్నా అభివృద్ధి శూన్యం
● ఆలయ పునర్నిర్మాణ పనుల కోసం ఎదురుచూపు
● రామకుప్పంలో ఇదీ పరిస్థితి..



ఏడాది క్రితం కూలగొట్టిన కోదండ రామాలయం

రామకుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రామాయణంలో నిందలు పాలై సీతమ్మతల్లి అరణ్యవాసం చేసిందని అందరికీ తెలుసు. అయితే అక్కడ వందల ఎకరాలకు పైగా భూములున్నప్పటికీ కోదండరాముడికి వనవాసం తప్పడం లేదు. సుమారు వందేళ్ల క్రితం నిర్మించిన ఆలయం పునర్నిర్మాణానికి నోచుకోలేదు. పైగా ఏళ్లుగా నిత్య ధూప, దీప, నైవేద్యాలు కరవయ్యాయి.. ఇదీ రామకుప్పం పట్టణంలోని కోదండరామాలయం కథ. మండల కేంద్రం రామకుప్పంలో సుమారు వందేళ్ల క్రితం మిట్టపల్లెకు చెందిన రాజుపేట రాఘవరెడ్డి వంశీకులు కోదండరామాలయాన్ని నిర్మించారు. జోడీదారులైన వారు ఆలయంలో నిత్య క్రతువుల నిర్వహణ, అభివృద్ధి కోసం వంద ఎకరాలకు పైగా భూములు ఆలయం పేరిట రాసిచ్చారు. ఇప్పటికీ వారి వంశస్తులే ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. 50 ఏళ్ల క్రితం వరకు ఆలయం ధూప, దీప, నైవేద్యాలు, పూజలతో అలరారింది. అంతేకాకుండా ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగేవి. కాలక్రమేనా ఒక్క ధనుర్మాసంలో తప్ప ఆలయంలో నిత్య ధూప, దీప, నైవేద్యాలు కరవయ్యాయి. అడపాదడపా ఆలయ అభివృద్ధిని స్థానికులు ప్రశ్నించడం, పత్రికల్లో వార్తలు రావడం జరుగుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. ఆలయ అభివృద్ధిపై ధర్మకర్తలు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. 1999లో అప్పటి సీఎంగా ఉన్న నారా చంద్రబాబునాయుడు స్థానిక టీడీపీ నేతల వినతితో ఆలయాల పునర్నిర్మాణాలకు సీజేఎఫ్ నుంచి నిధులు మంజూరు చేశారు. స్థానిక వరసిద్ధి వినాయక ఆలయానికి రూ.2 లక్షలు, కాశీవిశ్వేశ్వరాలయానికి రూ.1.4 లక్షలు, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి రూ.1.5 లక్షలతోపాటు కోదండరామాలయానికి రూ.3.7 లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో వరసిద్ధి వినాయకాలయం, కాశీవిశ్వేరాలయం, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల నిర్వాహకులు ప్రభుత్వానికి కార్పస్ ఫండ్ చెల్లించి, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆలయాలను సర్వాంగ సుందరంగా పునర్నిర్మాణం చేశారు. ఈ మూడు ఆలయాలకు ఎలాంటి మాన్యాలు లేవు. అయితే అన్ని ఆలయాలు పునర్నిర్మాణ ం చేయబడ్డాయి. వంద ఎకరాలకు పైగా మాన్యం కలిగి ఉన్న కోదండరామాలయం మాత్రం పునర్నిర్మాణానికి నోచుకోలేదు. ఏడాది క్రితం ఆలయ ధర్మకర్తలు ఆలయ పునర్నిర్మాణం చేపడుతామని ప్రకటించారు. ఈ క్రమంలో ఆలయంలోని మూలమూర్తులను బాలాలయానికి తరలించి ఆలయాన్ని కూలగొట్టారు. అయితే ఇప్పటి వరకు ఆలయ పునర్నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, సంబంధిత అధికారులు, ఆలయ ధర్మకర్తలు స్పందించి ఆలయ పునర్నిర్మాణం ప్రారంభించి, పూర్తి చేయాలని స్థానికుల కోరుతున్నారు.

కౌలు రైతు దంపతులపై దాడి

● క్యాబేజీ పంట ధ్వంసం



ధ్వంసమైన క్యాబేజీ పంట

రామకుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో రామకుప్పం పట్టణ శివార్లలోని ఆనందరెడ్డి పొలంలో కౌలు రైతు సాగు చేసిన క్యాబేజీ పంటను ప్రత్యర్థులు గురువారం రాత్రి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో ధ్వంసం చేశారు. కౌలు రైతు సురేష్‌రెడ్డి రామకుప్పం పోలీసులకిచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అడవిపాముగానిపల్లెకు చెందిన ఆనందరెడ్డికి చెందిన భూమిని అతని సమీప బంధువు సురేష్‌రెడ్డి ఐదేళ్లుగా కౌలుకు తీసుకుని అక్కడ కొంత భూమిలో నర్సరీ ఏర్పాటు చేసుకుని మిగిలిన భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నాడు. నాలుగేళ్ల క్రితం రామకుప్పంకు చెందిన సనావుల్లా, అతని కుమారులు ఆ భూమి తమకు చెందుతుందని సురేష్‌రెడ్డితో గొడవకు దిగారు. తాను భూమిని కౌలుకు మాత్రమే తీసుకున్నాని, ఏదైనా ఉంటే ఆనందరెడ్డితో మాట్లాడుకోవాలని సూచించాడు. గురువారం రాత్రి సనావుల్లా, అతని కుమారులు ఇబ్రహీం, కుర్షుస్, అబ్దుల్‌రహమాన్, హర్షద్‌లు, ముద్దనపల్లెకు చెందిన ఖాదర్‌బాషా, అఖిల్‌బాషా, సల్మాన్ తదితరులతో కలిసి అక్కడికి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో చేరుకున్నారు. ఆ భూమి తమకు చెందుతుందని అక్కడి నుంచి వెళ్లిపోవాలని నర్సరీలో ఉన్న సురేష్‌రెడ్డి, అతని భార్య యశోదమ్మలకు సూచించారు. ఆనందరెడ్డితో మాట్లాడుకోండంటూ సురేష్‌రెడ్డి వారికి చెప్పారు. దీంతో ఆగ్రహంతో రెచ్చిపోయిన సనావుల్లా తదితరులు వారిని మారణాయుధాలతో చంపేస్తామని బెదిరించారు. వారి ముందే భూమికి వేసిన కంచె రాతికూసాలు, ముళ్లకమ్మీలను తొలగించారు. అనంతరం ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో క్యాబేజీ పంటను, అందులోని డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. సురేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సనావుల్లా, అతని కుమారులు, తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.

దళితుల భూములను ఆక్రమించారని నిరసన



తహసీల్దారుతో మాట్లాడుతున్న నేతలు, బాధితులు

శాంతిపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దళితుల భూమిని వైసీపీ నేతలు ఆక్రమించారని కర్లగట్ట గ్రామానికి చెందిన బాధితులు శుక్రవారం మండల సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. కర్లగట్ట గ్రామానికి చెందిన బీరప్పకు దేవమ్మ, చంద్రమ్మ, రాధమ్మలు ముగ్గురు కుమార్తెలు. మగ సంతానం లేకపోవడంతో చంద్రమ్మ, రాధమ్మలు తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. బీరప్పకు కాళిగానూరు గ్రామ సమీపంలో రోడ్డు పక్కన రూ.కోట్ల విలువైన సర్వే నెంబర్ 11-1లో ఎకరా 12 సెంట్ల పట్టా భూమి ఉంది. వంశపారపర్యంగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని బాధితులు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో కర్లగట్ట గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త గోవిందప్ప, ఆనందాచారిలు ఎంపీపీ భర్త, మాజీ మండల వైసీపీ కన్వీనర్ కోదండరెడ్డి సహకారంతో కదిరిముత్తనపల్లె గ్రామానికి చెందిన సిద్ధప్ప పేరుపై ఆన్‌లైన్‌లో రికార్డులు మార్పు చేశారని బాధితులు వాపోయారు. కొంతకాలానికి భూమి తమదంటూ సిద్ధప్ప, పద్మమ్మలు భూమిలోకి ప్రవేశించారు. అప్పటి వరకు తమకు భూమి రికార్డులు మారిన విషయం తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిని తమకు ఆన్‌లైన్‌లో రికార్డులు మార్పు చేయిస్తామని అదే గ్రామానికి చెందిన సంపంగి, వెంకటేష్, వేణుగోపాల్ నమ్మించి రూ.1.20 లక్షలు తీసుకున్నారని. ఆ డబ్బులను సర్దుబాటు చేయడానికి అప్పులు చేయాల్సి వచ్చిందని వాపోయారు. అనంతరం తమకు న్యాయం చేయాలని తహసీల్దారు శివయ్యకు టీడీపీ నాయకులతో కలిసి విన్నవించారు. స్పందించిన ఆయన విచారణ చేయించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.

చెరువుల ఆక్రమణలపై అధికారులు స్పందించాలి



చెరువులో ఆక్రమణలను చూపుతున్న నరసింహులు

పుంగనూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం పుంగనూరు సమీపంలోని మేలుపట్ల చెరువులో ఆక్రమణకు గురైన భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో దాదాపు 15 ఎకరాల స్థలాన్ని ఆక్రమించి చదును చేసి రియల్‌ఎస్టేట్ భూములుగా తయారు చేసి విక్రయిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆక్రమణలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బైరెడ్డిపల్లె భవిత కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ జయప్రకాష్‌నాయుడు

బైరెడ్డిపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ జయప్రకాష్‌నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. భవిత కేంద్రంలో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలకు ఎలాంటి సమస్య లేకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చైతన్యాచారి, ఐఈ ఆర్పీలు నిర్మలకుమారి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వేలంతో తీర్థం పంచాయతీకి రూ.4.32 లక్షల ఆదాయం

బైరెడ్డిపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం పంచాయతీ పరిధిలోని కైగల్ జలపాతం వద్ద వాహనాల పార్కింగ్ వేలంతో రూ.4.32 లక్షలు పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖరాచారి తెలిపారు. గ్రామ సచివాలయంలో శుక్రవారం ఈవోఆర్డీ ప్రసాద్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రామకుప్పం తహసీల్దారుగా కౌలేష్



తహసీల్దారును సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

రామకుప్పం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల తహసీల్దారుగా కౌలేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమస్యలపై ఎట్టి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. కౌలేష్ శాంతిపురం డీటీగా ఉంటూ రామకుప్పం తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బాబు వెదురుకుప్పం బదిలీ అయ్యారు.

కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి



ఎంపీడీవో మురళీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రామకుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తమకు పనిభారం తగ్గించాలంటూ రామకుప్పం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గురువారం ఎంపీడీవో మురళీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ రాజ్ పరిధిలోని సుమారు 30 రకాల పనుల పర్యవేక్షణకు సమయం చాలడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే సామాజిక న్యాయం

శాంతిపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అట్టడుగున ఉన్న వారికి న్యాయం జరగాలనే రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టిందన్నారు. అంబేడ్కర్ ఆశయాల సాధనలో మలి అడుగే ఎస్సీ వర్గీకరణ అనేది ప్రభుత్వ విధానమన్నారు. జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టి దళితులకు ముఖ్యమంత్రి న్యాయం చేస్తారన్నారు. వర్గీకరణతో ఎలాంటి నష్టం జరగదని తెలిపారు.


వడదెబ్బపై విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విద్యాధికారి కాంతమ్మ

బైరెడ్డిపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో శుక్రవారం వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తీర్థం పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎండలో వెళ్లినప్పుడు గొడుగు ఉపయోగించాలని, నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత, బాల్యవివాహాల వల్ల కలిగే సమస్యలు, పోషకాహార ప్రాముఖ్యత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాయిదివ్య, రేవతి, ఉపాధ్యాయులు తదితరలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట రైతుల నిరసన



పలమనేరు, మార్చి 21 : విద్యుత్ సర్వీసులు, ఉన్న విద్యుత్ సర్వీసులకు అదనపు లోడు కోసం ట్రాన్స్‌ఫార్మర్లకు డబ్బులు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించడం లేదు. దీంతో విసిగిపోయిన రైతులు శుక్రవారం పలమనేరులోని గంగవరం మండల ట్రాన్స్‌కో కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపారు. నిజానికి పలమనేరు సబ్ డివిజన్ పరిధిలో వందలాదిమంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకోసం సొమ్ము చెల్లించి ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

అడవుల పరిరక్షణ ముఖ్యం



అటవీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఉన్నతాధికారులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అడవుల అభివృద్ధితోపాటు వాటి పరిరక్షణ ముఖ్యమని అటవీ శాఖ తిరుపతి బయో ట్రిమ్ డీఎఫ్‌వో నరేంద్రన్, డీఎఫ్‌వో భరణి అన్నారు. ప్రపంచ అటవీశాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక తూర్పు డివిజన్ సమావేశ మందిరంలో అడవుల అభివృద్ధి, వాటి సంరక్షణ, ఇతర అంశాలపై అటవీశాఖ తూర్పు, పశ్చిమ, కార్వేటినగరం రేంజ్ సిబ్బందితో సమీక్షించారు. నరంద్రన్ మాట్లాడుతూ.. ఎర్రచందనంలో ఫస్టీ గ్రేడ్ విత్తనాలు గుర్తించి ఉత్పత్తి చేస్తే నాణ్యమైన సంపదను వృద్ధి చేయవచ్చన్నారు. భరణి మాట్లాడుతూ.. అడవులు పరిరక్షించుకోవడంపై సిబ్బంది దృష్టి పెట్టాలని చెప్పారు. స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్ మాట్లాడుతూ.. అటవీ పరిధిలో జరిగే క్రైం కేసుల్లో పంచనామా నిర్వహణ, కేసుల నమోదు తదితరాలపై అవగాహన కల్పించారు. ట్రైనీ డీఎఫ్‌వో సాకేత్ గౌడ్, ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం: డీఎంవో



మాపాక్షిలో నీటి డ్రమ్ములను పరిశీలిస్తున్న డీఎంవో వేణుగోపాల్

చిత్తూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని జిల్లా మలేరియా నివరణాధికారి (డీఎంవో) వేణుగోపాల్ తెలిపారు. గురువారం చిత్తూరు మండలంలోని మాపాక్షి యూపీహెచ్‌సీ పరిధిలోని మాపాక్షి గ్రామాన్ని తనిఖీ చేశారు. ప్రతి ఫ్రైడేని డ్రైడేగా పాటించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు



యాదమరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జోడిచింతల వద్ద ఉన్న సుచి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వాహకులు పాల్ విజయ్‌కుమార్, గ్లోరీ మాట్లాడుతూ వేలూరు సీఎంసీ ఆస్పత్రి వైద్యులతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 110 మందికి బీపీ, షుగర్, హృద్రోగ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. సీఎంసీ వైద్యులు క్రిస్‌మేరిమోన్స్, అంజలి, జోసెఫ్ ధరణికుమార్, సుచి సిబ్బంది ఆనంద్, ధనలక్ష్మి, వరదరాజులు, జాన్సన్, మణి, చిన్నయ్య, శశికుమార్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలను పరిశీలించిన ఆర్డీవో



కేవీపురంలో ఇంటి స్థలాలు పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీశంకరి

విజయపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేవీపురంలో దళితులకు ఇచ్చిన ఇంటి స్థలాలను ఆర్డీవో భవానీశంకరి శుక్రవారం పరిశీలించారు. గత ప్రభుత్వం జగనన్న ఇంటి పేరుతో పట్టాలు ఇచ్చి 78 మందికి ఇంటి స్థలాలు చూపలేదని సీపీఐ నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించడంతో స్థల పరిశీలన చేశారు. పట్టాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ స్థలాలు చూపుతామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ కిరణ్, మండల సర్వేయర్ శేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సీపీఐ మండల నాయకులు రవి, కృష్ణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూతలపట్టు తహసీల్దార్‌గా రమేష్ బాధ్యతల స్వీకారం



పూతలపట్టు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు తహసీల్దార్‌గా రమేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న గుర్రప్ప కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వెదురుకుప్పం తహసీల్దార్‌గా ఉన్న రమేష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

బాల్య వివాహాలను అరికడదాం



ముక్కళత్తూరు హైస్కూల్లో మాట్లాడుతున్న కౌన్సెలర్ ఉష

గంగాధరనెల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మహిళా శిశు సంక్షేమ ప్రొటెక్షన్ కౌన్సెలర్ ఉష, ఔట్‌రీచ్ వర్కర్ షణ్ముగం, సచివాలయం మహిళా పోలీస్ శోభ పిలుపునిచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో ముక్కళత్తూరు హైస్కూల్లో శుక్రవారం బాలికల సంరక్షణ, బాల్య వివాహాలను అరికట్టడంపై విద్యార్థినులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం లోకనాథం, సోషియల్ వర్కర్స్ మురళి, ఉమాదేవి పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రంలో తహసీల్దార్ తనిఖీలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న బాబూ రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని టెన్త్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

దుప్పుల దాడులతో పంటల ధ్వంసం

సోమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కేంద్రంలోని ఎగువకుంట సమీప రైతుల టమోటా తోటల్లో గురువారం రాత్రి దుప్పులు స్వైరవిహారం చేసి పంటలను ధ్వంసం చేశాయి. కామిశెట్టి సోమశేఖర్ వారం క్రితం 3 వేల మొక్కలు నాటాడు. దుప్పుల కారణంగా నష్టపోయాడు. అలాగే శంకర్, లక్ష్మయ్య, మదనమోహన్ పొలాల్లోని టమోటా తోటలలో పంటలను తొక్కేశాయి. తమ వేరుశనగ పంటలో నెమళ్ల కారణంగా నష్టం జరుగుతోందని రైతు సుధాకర్ వాపోయాడు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు

బంగారుపాళ్యం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న క్రీడామైదానంలో సినీనటుడు సప్తగిరి ప్రసాద్ చిత్రం విడుదల సందర్భంగా ఆయన స్నేహితులు క్రికెట్ టోర్నీ నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీల్లో బంగారుపాళ్యంకు చెందిన పాయిజన్ బాయ్స్ గెలిచి మొదటి బహుమతి పది వేలను అందుకోగా, రెండో బహుమతిగా రూ.5వేలను బంగారుపాళ్యం జట్టు గెలుచుకుంది. విజేతలకు నిర్వాహకులు మేస్త్రి చంద్ర, కేశవులు బహుమతులు ప్రదానం చేశారు.



కళాశాల హాస్టల్ ముందు
ఆకతాయిల హల్‌చల్
ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



కళాశాల ఎదురుగా ఉన్న చికెన్ పకోడా దుకాణం

చిత్తూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం బీఎస్ఆర్ పేటలోని ఏరిస్ కళాశాల హాస్టల్ ఎదుట ఓ చికెన్ పకోడా దుకాణం ఉంది. ఇక్కడికి రాత్రిపూట కొందరు ఆకతాయిలు వచ్చి హల్‌చల్ చేస్తున్నారు. పైగా వీరంతా మద్యం తాగిన మత్తులో అరుపులు, కేకలు పెడుతుండటంతో హాస్టల్‌లోని విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ దుకాణం ప్రభుత్వ స్థలంలో ఉందని, విద్యుత్‌ను కూడా అక్రమంగా వాడుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 24మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. 24 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించి, కేసు నమోదు చేశారు. వీరిని శుక్రవారం జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. విచారించిన ఆమె ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.2.40 లక్షల జరిమానా విధించారు.

ఇలాగే వదిలేస్తారా?



ఇదెక్కడో గ్యారేజీలో మూలపడిన వాహనం కాదు. ఎస్ఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు 108 అంబులెన్స్ ఇలా దర్శనమిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ వాహనం మరమ్మతులకు గురైతే ఇక్కడిలా వదిలేశారు. ఇప్పటికీ అలాగే ఉంచేయడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి

ఆర్తనాదాలతో దద్దరిల్లిన పీహెచ్‌సీ



పీహెచ్‌సీ వద్ద కుటుంబీకుల రోదన

వెదురుకుప్పం/శ్రీరంగరాజుపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లె సమీపంలో ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడ్డవారి ఆర్తనాదాలతో ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీ శుక్రవారం దద్దరిల్లింది. బాధితుల కుటుంబీకులు కూడా పెద్ద ఎత్తున చేరుకున్నారు. పరిసరాలన్నీ వారి రోదనలతో నిండిపోయాయి. బాధితులను టీడీపీ నేత గంధమనేని జయశంకర్‌నాయుడు, ఎస్సీ సెల్ జీడీనెల్లూరు ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం సుధాకర్, మాల కార్పొరేషన్ డైరెక్టరు యుగంధర్, తదితరులు పరామర్శించారు.





పీహెచ్‌సీ వద్ద యుగంధర్, సుధాకర్ తదితరులు - బాధితురాలిని పరామర్శిస్తున్న జయశంకర్‌నాయుడు తదితరులు

ఎమ్మెల్యే కార్యాలయంలో ఇకపై బుధవారం ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కార్యాలయంలో ఇకపై బుధవారం ప్రజాదర్బార్ (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఇప్పటి వరకు ప్రతి శనివారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఎమ్మెల్యేలు ప్రతి బుధవారం ఉదయం అన్ని నియోజకవర్గాల్లో ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించడం, మధ్యాహ్నంపైన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

చిన్నారులపై శ్రద్ధ చూపాలి



కార్వేటినగరంలో సూచనలిస్తున్న సూపర్ వైజర్లు శామిని, ఇందిర

వెదురుకుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు వచ్చే చిన్నారులపై శ్రద్ధ చూపాలని కార్వేటినగరం ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శామిని, ఇందిర కోరారు. శుక్రవారం కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు 'పోషణ బీ-బడాయి బీ' కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. పలు సూచనలు, సలహాలను ఇచ్చారు.

గంగాధరనెల్లూరు: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ, సూపర్‌వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మందుల వితరణ



గంగాధరనెల్లూరు, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి సహకారంతో ముత్తిరేవుల ఎస్వీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్ఎస్ఎస్ మెడికల్ క్యాంపునకు మందులను శుక్రవారం వితరణ చేశారు. చిత్తూరు ఆస్పత్రిలో డాక్టర్ దుర్గాదేవి చేతులమీదుగా ఎన్ఎస్ఎస్ ప్రతినిధులకు అందజేశారు. డాక్టర్ రాజన్న, ఎస్వీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ దేవిప్రియ, జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి సహదేవనాయుడు, ఫీల్డ్ కోఆర్డినేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో పోతనది ప్రత్యేక స్థానం

పలమనేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో గొప్ప సహజ కవి బమ్మెర పోతన అని.. ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో తెలుగు శాఖ నిర్వహించిన భాగవతం, భక్తి, తాత్వికత, సామాజికత అనే రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు అంటే పోతన.. పోతన అంటే మహాభాగవతం అన్నారు. తిరుపతి ఓరియంటల్ రీసర్చ్ కళాశాల ఆచార్యులు పి.సి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచమే గుర్తించదగిన గొప్ప కవి పోతన అన్నారు. కార్యక్రమంలో ఆచార్య రాజేశ్వరమ్మ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం

గంగవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సామాజిక సమస్యలను ఎత్తిచూపేలా కవులు కవిత్వాలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తులసీనాధం నాయుడు, మాధవరెడ్డి, చంద్రశేఖరయ్య, బాలాజీ, సంస్థ కార్యదర్శి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాన్ని ఛేదించిన పోలీసులు

● రూ.3.65 లక్షల వస్తువులను బాధితుడికి ఇప్పించారు

చిత్తూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి అలంకరణలో భాగంగా అల్మారాల కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టి మోసపోయిన ఓ వ్యక్తి కేసును సైబర్ క్రైమ్ పోలీసులు ఛేదించారు. ఎస్పీ మణికంఠ ప్రత్యేక చొరవతో ఈ కేసును పరిష్కరించారు. చిత్తూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి కేబీఆర్ఎస్ అరిస్టో లిమిటెడ్ కంపెనీ వద్ద అలమరాలకు సంబంధించిన వస్తువుల కోసం గత ఏడాది అక్టోబరు 31వ తేదీన క్యూఆర్ కోడ్ ద్వారా రూ.3.65 లక్షలను చెల్లించాడు. అయితే కంపెనీ ఆర్డర్‌పెట్టిన వస్తువులను ఇవ్వలేదు. బాధితుడు అనేకమార్లు ఫోన్ ద్వారా సంప్రదించినా ఫలితం లేదు. మోసపోయామని గ్రహించిన అతను ఈనెల 10వతేదీన సైబర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాలతో సైబర్ పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. కంపెనీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడంతో నిర్వాహకులు స్పందించారు. ఈనెల 19వతేదీన బాధితుడు ఆర్డర్ పెట్టిన వస్తువులను కంపెనీ అందించింది. సైబర్ పోలీసులు స్పందించిన తీరును బాధితుడు అభినందిస్తూ ఎస్పీకి లేఖ రాశారు. ఆన్‌లైన్ లావాదేవీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి: యూటీఎఫ్



నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ ఐదో తేదీన తిరుపతిలో జరగనున్న ఐదు జిల్లాల ప్రాంతీయ విద్యాసదస్సు, పోరుబాట సదస్సును విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం, డీఎస్సీ విడుదల, జీవో 117 రద్దు అంశాలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా కార్యదర్శి మణిగండన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు దంపతులపై దాడి

● క్యాబేజీ పంట ధ్వంసం

రామకుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో రామకుప్పం పట్టణ శివార్లలోని ఆనందరెడ్డి పొలంలో కౌలు రైతు సాగు చేసిన క్యాబేజీ పంటను ప్రత్యర్థులు గురువారం రాత్రి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో ధ్వంసం చేశారు. కౌలు రైతు సురేష్‌రెడ్డి రామకుప్పం పోలీసులకిచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అడవిపాముగానిపల్లెకు చెందిన ఆనందరెడ్డికి చెందిన భూమిని అతని సమీప బంధువు సురేష్‌రెడ్డి ఐదేళ్లుగా కౌలుకు తీసుకుని అక్కడ కొంత భూమిలో నర్సరీ ఏర్పాటు చేసుకుని మిగిలిన భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నాడు. నాలుగేళ్ల క్రితం రామకుప్పంకు చెందిన సనావుల్లా, అతని కుమారులు ఆ భూమి తమకు చెందుతుందని సురేష్‌రెడ్డితో గొడవకు దిగారు. తాను భూమిని కౌలుకు మాత్రమే తీసుకున్నాని, ఏదైనా ఉంటే ఆనందరెడ్డితో మాట్లాడుకోవాలని సూచించాడు. గురువారం రాత్రి సనావుల్లా, అతని కుమారులు ఇబ్రహీం, కుర్షుస్, అబ్దుల్‌రహమాన్, హర్షద్‌లు, ముద్దనపల్లెకు చెందిన ఖాదర్‌బాషా, అఖిల్‌బాషా, సల్మాన్ తదితరులతో కలిసి అక్కడికి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో చేరుకున్నారు. ఆ భూమి తమకు చెందుతుందని అక్కడి నుంచి వెళ్లిపోవాలని నర్సరీలో ఉన్న సురేష్‌రెడ్డి, అతని భార్య యశోదమ్మలకు సూచించారు. ఆనందరెడ్డితో మాట్లాడుకోండంటూ సురేష్‌రెడ్డి వారికి చెప్పారు. దీంతో ఆగ్రహంతో రెచ్చిపోయిన సనావుల్లా తదితరులు వారిని మారణాయుధాలతో చంపేస్తామని బెదిరించారు. వారి ముందే భూమికి వేసిన కంచె రాతికూసాలు, ముళ్లకమ్మీలను తొలగించారు. అనంతరం ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో క్యాబేజీ పంటను, అందులోని డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. సురేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సనావుల్లా, అతని కుమారులు, తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.

భక్తులతో మర్యాదగా వ్యవహరించండి
సిబ్బందికి వరసిద్ధుడి ఆలయ ఈవో ఆదేశం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి విచ్చేసే భక్తులతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందిని ఈవో పెంచలకిషోర్ ఆదేశించారు. శుక్రవారం ఆలయ టికెట్ కౌంటర్లను తనిఖీ చేశారు. అక్కడున్న భక్తులతో గణేశ అని సంబోధిస్తూ మాట్లాడారు. తర్వాత అన్నదాన కేంద్రాన్ని తనిఖీ చేశారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించి, రుచిగా ఉందా అని ఆరా తీశారు. వేసవి కాలం సెలవుల్లో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేస్తారని.. వారికి సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏ భక్తుడూ ఇబ్బంది పడకుండా చూసుకోవాలన్నారు. సిబ్బందికి సమస్యలుంటే తన దృష్టికి తేవాలని చెప్పారు. ఆలయ ఉద్యోగులు,సిబ్బంది శ్రమిస్తే ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని సిబ్బందికి తెలియజేశారు. అలాగే డొనేషన్ కౌంటర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి, ఆలయ సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

విజయపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పన్నూరు సబ్‌స్టేషన్‌లోని వేలాయుధం కల్యాణ మండపంలో శనివారం ఉదయం 9.30 గంటలకు టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చిన బాబు తెలిపారు. కార్యకర్తలు, అనుబంధ కమిటీ సభ్యులు హాజరు కావాలన్నారు.

24న గుడిపాల మండల మీట్

గుడిపాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివరాజ్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు హాజరుకావాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

చిత్తూరు అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దుర్గానగర్‌లోని ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేదీన జరుగుతుందని కార్యదర్శి ఆర్.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

రేపు నేత్ర వైద్యశిబిరం

చిత్తూరు కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు నగర జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ తెలిపారు. తిరుపతి అరవిందనేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో 23న ఉదయం 7 నుంచి 12 గంటల వరకు కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్లు అవసరమైనవారికి చిత్తూరు జైన్ సంఘం అన్ని ఖర్చులు భరించి ఉచితంగా చేయిస్తుందన్నారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు



వెదురుకుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు.

4నుంచి రాములోరి ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'ముంతాజ్ హోటల్' రద్దుపై హర్షం

గుడిపాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అలిపిరి సమీపంలో ముంతాజ్ హోటల్ నిర్మాణానికి ఇచ్చిన అనుమతి రద్దుకు సీఎం ఆదేశాలివ్వడంపై టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు స్వామినాథ్ గౌడ్ హర్షం వెలిబుచ్చారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ హయాంలో ఇచ్చిన అనుమతులను రద్దు చేయడం సంతోషదాయకం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుమల క్షేత్రాన్ని ఒక వ్యాపార, రాజకీయ క్షేత్రంగా మార్చారన్నారు.

బ్యానర్లు చించేశారని పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జనసేన, టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించేశారని నాయకులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆరడిగుంట పంచాయతీ టీడీపీ పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, రమేశ్‌నాయుడు, మణి, వీరభద్రస్వామి, జనసేన నాయకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.